క్లుప్తంగా

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



డాక్టరేట్ గ్రహీత ఈ.రేఖ

పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్రం అధ్యాపకురాలు ఈ.రేఖకు అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆమె ఆచార్య ఆర్.జీవన్‌కుమార్ పర్యవేక్షణలో అల్ట్రాసోనిక్ వెలాసిటీస్ అండ్ రిలేటెడ్ పారామీటర్స్ ఇన్ సమ్ ఎడిబుల్ ఆయిల్స్ మాస్ ఏ ఫంక్షన్ ఆఫ్ ఫ్రీక్వెన్సీ అండ్ టెంపరేచర్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆమెను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.మొహిద్దీన్‌బాషా, అధ్యాపకులు అభినందించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

పాకాల : మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఐసీడీఎస్ దామలచెరువు సెక్టార్‌లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్‌బీ–పడాయిబీపై శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ శిక్షణా తరగతులు ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు పోషణ్‌బి–పడాయిబీ ప్రాముఖ్యతను వివరించినట్టు తెలిపారు. ఆదర్శాల నవచేతన, 6 సంవత్సరాల పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదం చేసే అంశాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వినిత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న భారతి

ఎర్రావారిపాళెం(భాకరాపేట): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. ఆమె గురువారం ఎర్రావారిపాళెంలో పోషణ్ బీ–పడాయిబీపై శిక్షణ ఇచ్చారు.

తిరుమలలో వాహనాల తనిఖీ

తిరుమల: తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్ద గురువారం ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తనిఖీ చేశారు. రెండు ట్యాక్సీల డ్రైవర్లకు లైసెన్స్ లేనట్టు గుర్తించారు. వాహనాలను సీజ్ చేసి ఆర్టీఏకు అప్పగించారు. వాటికి అధికారులు రూ.5 వేల చొప్పున జరిమానా విధించి, నెలరోజులు తిరుమలకు అనుమతించకుండా నాట్ అలోడ్‌లో పెట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులు లేకుండా తిరుమలకు వస్తే సహించేది లేదని సీఐ హరిప్రసాద్ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తిరుపతి కల్చరల్: మహిళలు చేతివృత్తుల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని రాస్ మహిళా పొదుపు సంఘాల సంచాలకుడు వి.నాగరాజు పిలుపునిచ్చారు. రాస్, జన్‌శిక్షణా సంస్థాన్ సంయుక్తంగా గురువారం సప్తగిరి నగర్‌లో మహిళలకు ఇస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ గురువారం ముగిసింది. మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. జన్‌శిక్షణా సంస్థాన్ ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్, ఐద్వా నేత సాయిలక్ష్మి, రాస్ ప్రతినిధులు కరుణాకర్, శ్రీలత, పద్మ, నాగరాజు, క్లస్టర్ లీడర్లు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణ



తిరుపతి తుడా : తిరుపతిరూరల్ మండలం పేరూరు పంచా యతీ జీవోస్ కాలనీలో భవన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారు. జీవోస్ కాలనీలో ప్లాట్ నంబర్ 190 యజమాని రోడ్డును ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మిస్తున్నాడు. సొంతంగా కాలువ నిర్మాణాన్ని చేపట్టి అదే హద్దుగా చూపించే ప్రయత్నం చేస్తున్నాడు. జీవోస్ జర్నలిస్ట్ కాలనీలకు వెళ్లేందుకు ప్రధాన మార్గం 190 ప్లాట్ పక్కన వెళ్లాల్సి ఉంది. టర్నింగ్ బిట్టు కావడంతో ఆక్రమణ వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తుడా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి, ప్లాను ప్రకారం నిర్మాణాలు సాగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తల్లిదండ్రులు మందలించారని!

తిరుపతి క్రైమ్: తల్లిదండ్రులు మందలించారని ఓ బాలుడు ఇల్లు వదిలి వెళ్లిన ఘటన గురువారం చోటు చేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం మేరకు.. సింగాలగుంటలో నివాసం ఉన్న ఓ బాలుడు (15) నగరంలోని కర్నాల వీధిలో ఉన్న ఓ ప్రయివేటు స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన సమయంలో తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నట్లుగా లేఖ రాసి పెట్టి వెళ్లిపోయాడు. దీనిపై ఆ బాలుడి తల్లిదండ్రులు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడు ఆచూకీ తెలిస్తే 9440796752 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహాశివరాత్రి వేడుకల పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: తిరుచానూరు కొత్రమంగళం రోడ్డులోని స్వర్ణముఖి నదీ తీరంలో ఈ నెల 26న మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామిజీ, బీజేపీ నేత గుండాల గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. వారు గురువారం తిరుపతిలోని నేరేళ్లమ్మ ఆలయం వద్ద వేడుకల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. .

రియల్టర్ల దందా

కూటమి నేతల అండతో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. ప్రైవేట్ లేఅవుట్లు, వెంచర్లకు చెరువుల నుంచి మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. అంతటితో ఆగక డీకేటీ భూములు, చెరువు పొరంబోకు భూములను ఆక్రమించుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు దారి తీస్తోంది.



జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలింపు

- లేఅవుట్లకు చెరువు మట్టి తరలింపు
- టీడీపీ నేతల అండతో రెచ్చిపోతున్న వైనం
- కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు

పాకాల : మండలంలోని నేంద్రగుంట సమీపంలో జాతీయ రహదారి వెళుతుండడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. కొంతమంది ఇక్కడ ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకుని స్థిరనివాసం ఏర్పరుచుకుంటున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న రియల్టర్లు పొలాలను కొనుగోలు చేసి వెంచర్లు, లేఅవుట్లు వేస్తున్నారు. వాటిలో రోడ్ల వేసుకోవడానికి, స్థలాలను ఎత్తు చేసుకోవడానికి దూర ప్రాంతం నుంచి మట్టిని తరలించుకోవాల్సి ఉంది. వారు పక్కనే ఉన్న చెరువుల నుంచి మట్టిని తరలిస్తున్నారు. ఇటీవల ఒక వ్యక్తి సర్వే నంబర్లు 2362, 2363, 2364, 2365, 2368, 2377లలోని సుమారు 20 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అందులో వెంచర్లు వేశాడు. అందులోని ప్లాట్లకు చెరువు నుంచి మట్టిని తరలించేందుకు ప్రయత్నించారు. అతనికి టీడీపీ నాయకుడు సహకారం అందించాడు. దీంతో చెరువులో జేసీబీని పెట్టి యథేచ్ఛగా తవ్వకాలు చేస్తూ మట్టిని తరలిస్తున్నారు. అంతటితో ఆగకుండా వెంచర్ పక్కనే ఉన్న దిగువ కుంట చెరువులో కొంత భాగాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రియల్టర్ల నుంచి టీడీపీ నాయకుడు రూ.20 లక్షలు తీసుకున్నట్టు ఆరోపిస్తున్నారు. అతని ఒత్తిడి వల్లే రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రియల్టర్ల దందాను అడ్డుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ని సంతోష్‌సాయిని వివరణ కోరగా సమాచారం అందిన వెంటనే సిబ్బందిని పంపి అక్రమంగా తరలిస్తున్న మట్టి పనులను నిలిపేయించామన్నారు. ఇక ముందు కూడా ఎవరూ మట్టిని తరలించకుండా నిఘా పెడతామన్నారు. చెరువు భూమి ఆక్రమణకు గురి కాలేదని తెలిపారు.



వెంచర్‌లో తోలిన చెరువు మట్టి



చెరువులో జేసీబీతో తవ్విన మట్టి

పెరుగుతున్న ఎమ్మెల్యే తనయుడి అరాచకాలు

- టౌన్ బ్యాంక్‌పైనా పెత్తనం
- బీసీ, యాదవుల అణచివేతకు కుట్ర
- టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్ ధ్వజం



మాట్లాడుతున్న వాసు యాదవ్

తిరుపతి కల్చరల్ : తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు మదన్ అరాచకాలకు హద్దు లేకుండా పోతోందని అఖిల భారత యాదవ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్ ధ్వజమెత్తారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీ, యాదవుల అణచివేతే లక్ష్యంగా దాడులు సాగుతున్నాయన్నారు. 2022లో టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో డైరెక్టర్‌గా ఎన్నికైన తాను అదే డైరెక్టర్ల మద్దతుతో వైస్ చైర్మన్‌గా ఎన్నికైనట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయరెడ్డి బీసీలకు గౌరవప్రదమైన స్థానం కల్పించారని తెలిపారు. తనకు ప్రత్యేక చాంబర్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. దీన్ని జీర్ణించుకోలేని ఆరణి మదన్ అధికారులను బెదిరించి చాంబర్ తాళాలు, నామ శిలాఫలకాన్ని పగులగొట్టారని ఆరోపించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులా? లేక ఆరణి మదనా అని ప్రశ్నించారు. టౌన్ బ్యాంక్‌కు ఆరణి మదన్‌కు సంబంధం ఏమిటని, ఏ హోదాతో టౌన్ బ్యాంక్‌పై పెత్తనం చెలాయిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ఆర్‌సీఎస్, కమిషనర్, ఆర్‌బీఐకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అరుణ్‌కుమార్, చింతా రమేష్ యాదవ్, పునీత, వడ్డెర సంఘం నేత రమణ, పుష్పలత పాల్గొన్నారు.

ఈడిగ గౌడ సంఘం మండల నూతన కార్యవర్గం



అధ్యక్షుడు శ్రీనివాసులుగౌడ్



సెక్రటరీ గెడ్డం గోపి



ట్రెజరర్ దిండిపాటి కుమార్

పాకాల : ఈడిగ గౌడ సంఘం మండలం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు నాయకులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఉన్న ఊటుకూరు విజయ్‌కుమార్‌గౌడ్ ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో గురువారం సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో అధ్యకుడిగా ఊటుకూరు శ్రీనివాసులు, సెక్రటరీగా గడ్డం గోపి, ట్రెజరర్‌గా దిండుపాటి కుమార్, గౌరవ అధ్యక్షుడిగా పట్నం సోమశేఖర్, గౌరవ సలహాదారుగా ఊటుకూరు గోపి, వైస్ ప్రెసిడెంట్‌గా మొగరాల మోహన్, జనరల్ సెక్రటరీగా తోకల గురుదేవ్ ఎన్నికయ్యారు. సభ్యులుగా 25 మందిని ఎంపిక చేశారు. వారిని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల చెంగయ్య, తిరుపతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డిండిపాటి కుమార్‌స్వామి, జీవకోన మాజీ సర్పంచ్ తోకల మురళీ అభినందించారు.

వైభవంగా గోవిందరాజస్వామి ప్రణయ కలహోత్సవం



ప్రణయ కలహోత్సవానికి విచ్చేస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి వారి ఆలయంలో గురువారం ప్రణయ కలహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా అధ్యయనోత్సవాల్లో భాగంగా ప్రణయ కలహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 5 గంటలకు గోవిందరాజస్వామి, అమ్మవారు వారు పల్లకిలో కుంభహారతి మండపం వద్దకు చేరుకున్నారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరపున జియ్యంగారు పూలచెండ్లతో విహారయాత్రకు వెళ్లి వచ్చిన స్వామివారిని మూడు సార్లు తాకించారు. స్వామి వారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడతారు. అనంతరం అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా చేరి కర్పూర హారతులు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. తర్వాత ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయంగార్‌స్వామి, చిన్నజీయంగార్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.

మొండి బకాయిలపై ఉక్కుపాదం



అద్దె చెల్లించాలని దుకాణం ముందు నిరసన తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గురువారం ఆస్తి పన్ను బకాయిదారులపై ఉక్కుపాదం మోపారు. మున్సిపల్ కార్పొరేషన్ కాంప్లెక్స్ గదుల్లో అద్దెలు చెల్లించని వారి దుకాణాల ముందు నిరసన తెలిపారు. శ్రీనివాసంకు ఎదురుగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ కాంప్లెక్స్‌లో కొంతకాలంగా అద్దె చెల్లించని దుకాణదారుల వద్దకు వెళ్లారు. ఒక షాపుకు సంబంధించి అద్దెను అప్పటికప్పుడే చెల్లించగా, రెండవ నంబర్ దుకాణాన్ని క్లోజ్ చేశారు. సకాలంలో పనులు చెల్లించని పక్షంలో దుకాణాలను స్వాధీనం చేసుకుంటామని ఆర్వో రవి హెచ్చరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

వెటర్నరీ జూడాల సమ్మె ఉధృతం



ఓపీలను స్తంభింపజేసి నిరసన తెలుపుతున్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాల సమ్మె తారాస్థాయికి చేరింది. గౌరవవేతనాన్ని పెంచాలంటూ చేపట్టిన నిరవధిక నిరసన 11వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా గురువారం వర్సిటీలోని పశువైద్యశాలలో అన్ని రకాల ఓపీలు, ఓటీలను వెటర్నరీ జూడాలు స్తంభింపజేశారు. దీంతో రైతులు, పెట్ యజమానులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, జూడాల సమ్మెతో వైద్యశాల నుంచి వెనుదిరగాల్సి వచ్చింది. పశువైద్యశాల ఎదుట పెద్ద సంఖ్యలో యూజీ, పీజీ విద్యార్థులు స్టయిఫండ్ పెంచాలని, న్యాయం చేసే వరకు సమ్మె విరమించబోమని నినదిస్తూ బైఠాయించారు. జూడాల ఆర్థిక ఇబ్బందులు, రైతులకు వారు అందిస్తున్న సేవలపై నాటికలను ప్రదర్శించి, తమ గోడును వినూత్న రీతిలో ప్రభుత్వానికి తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 11రోజులుగా విధులు బహిష్కరించి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతుంటే ప్రభుత్వం, వర్సిటీ అధికారులు స్పందించక పోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీ విద్యార్థులకు రూ.25 వేలు, పీజీ విద్యార్థులకు రూ.50 వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.75 వేలు గౌరవవేతనం ఇచ్చేవరకు సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు. ప్రజలు, రైతుల తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడికి తీవ్ర గాయాలు

చంద్రగిరి: మండలంలోని తొండవాడ సమీపంలో బుధవారం అర్ధరాత్రి బైక్ బోల్తాపడి యువకుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. చంద్రగిరి భారతీనగర్‌కు చెందిన హరీష్ పుట్టిన రోజు సందర్భంగా పెరుమాళ్లపల్లి పంచాయతీ కొప్పరవాండ్లపల్లెకు చెందిన శ్రావణ్‌తో కలసి పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. అనంతరం బుధవారం అర్ధరాత్రి కాలూరు నుంచి చంద్రగిరికి వైపుగా ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పీఎల్ఆర్ క్యాండీ సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో హరీష్ తీవ్రంగా గాయపడగా శ్రావణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన అధికారులు, హరీష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీల్లో నేటి కార్యక్రమాలు

- ఏపీ పీజీ సెట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎస్వీయూలోని అన్నమయ్య భవన్‌లో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం.
- మహిళా వర్సిటీలో రూరల్ టూరిటజం అండ్ సస్టైనబుల్ రూరల్ లైవ్‌లీ హుడ్‌పై జాతీయ సదస్సు.
- వెటర్నరీ వర్సిటీలో శాస్త్రీయ పద్ధతుల్లో సీమ పందుల పెంపకంపై శిక్షణ కార్యక్రమం
- జాతీయ సంస్కృత వర్సిటీలో రెండవ రోజు భారతీయ భాషల పుస్తక రచయితల వర్క్‌షాపు
- పద్మావతి మహిళా వర్సిటీలో పేటెంట్ హక్కులపై జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం
- జూడాల సమ్మెలో భాగంగా వెటర్నరీ వర్సిటీ పశువైద్యశాలలో ఓపీ సేవలు బంద్
- నగరంలో తాతయ్యగుంట వద్దగల పశువైద్యశాలలోనూ ఓపీలను నిలిపివేయనున్న వెటర్నరీ జూడాలు. – తిరుపతి సిటీ

నగరంలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



అలిపిరి పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు గురువారం తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా ఎప్పటికప్పుడు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వన్ వేలు, నో పార్కింగ్‌లను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. స్కూళ్లు, కాలేజీల వద్ద నిరంతరం గస్తీ ఏర్పాటు చేసి అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం అలిపిరి పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు.

ఏపీపీగా బాలకృష్ణమనాయుడు



తిరుపతి లీగల్ : తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా ముప్పారపు బాలకృష్ణ నాయుడిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో మూడు సంవత్సరాలు ఉంటారు. ఆయన తిరుపతిలో సుమారు 30 ఏళ్లుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. సీనియర్ న్యాయవాది, దివంగత ఛాయాపతి వద్ద జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. గతంలో ఆయన తిరుపతిలో గవర్నమెంట్ ప్లీడర్‌గా, ప్రత్యేక గవర్నమెంట్ ప్లీడర్‌గా విధులు నిర్వహించారు. ఆయన నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించుకోవాలి

తిరుపతి కల్చరల్ : దేశంలోని విశాల అటవీ ప్రాంతాల్ని బడా కార్పొరేట్లకు కట్టబెట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్‌ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి పి.వెంకటరత్నం డిమాండ్ చేశారు. వారు గురువారం వారు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై ప్రత్యక్ష సైనిక యుద్ధం చేస్తూ అడవుల్ని నెత్తుటి క్షేత్రంగా మారుస్తోందన్నారు. అందులో భాగంగానే ఆపరేషన్ కగార్‌ను తీసుకువస్తోందని దుయ్యబట్టారు. దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నేతలు లోకేష్, విజయకుమార్, మహేష్, ధనశేఖర్, వెంకట శ్రీనివాసులు, ఏఐకేఎంఎస్ నేతలు సురేష్‌రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

16న వధూవరుల వివరాల పుస్తకాలు పంపిణీ

తిరుపతి కల్చరల్ : కంచి పాదుకా మండపంలో ఈనెల 2న వివాహ పరిచయ వేదిక నిర్వహించినట్టు వేంకటగాయిత్రి వివాహ పరిచయ వేదిక అధ్యక్షుడు సీఆర్‌కే.శేషగిరిరావు తెలిపారు. అందులో పేర్లు నమోదు చేసుకున్న వారికి వారి వివరాలతో ముద్రించిన పుస్తకాలను ఈ నెల 16న అందజేయనున్నట్లు తెలిపారు. రెడ్డి రెడ్డి కాలనీలోని వేంకటగాయిత్రి వివాహ సమాచార కేంద్రంలో వాటిని పొందవచ్చని తెలిపారు. అలాగే ఇదే రోజు పురోహితులకు ఉచిత నమోదు సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9440271154, 9247844224లను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రత్యేక అదాలత్



వినియోగదారుల సమస్యలు వింటున్న విద్యుత్‌శాఖ అధికారులు

పాకాల : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి రూరల్ డివిజన్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఆయన గురువారం పాకాలలోని 33–11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై 18 అర్జీలు వచ్చాయి. వాటిలో 7 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన 11 సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీఈ జీవన్‌కుమార్, ఆపరేషన్ ఏఈ ప్రశాంత్, పాకాల రూరల్ ఏఈ హరిప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



మొక్కలు నాటుతున్న గంగిరెడ్డి

తిరుపతి సిటీ : పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గంగిరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన గురువారం కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో మొక్కలు నాటి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ నాదమునిరెడ్డి పాల్గొన్నారు.

తాత్కాలిక ఉద్యోగులకు టైంస్కేల్ ఇవ్వాలి



జాతీయ సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

తిరుపతి సిటీ : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఆప్కాస్ కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని కోరుతూ ఈ నెల 16న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. వారు గురువారం స్విమ్స్ ఆవరణలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్–2ను సవరించి అందరికీ ఎంటీఎస్ అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పును శిరసావహిస్తూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

లక్ష్మీపై కేసు నమోదుకు ఒత్తిడి

తిరుపతి రూరల్: జనసేన పార్టీ తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ బాధితురాలు లక్ష్మీపై కేసు నమోదుకు పట్టుబట్టారు. లక్ష్మీకి తాను రూ.30 లక్షలు బాకీ ఇవ్వాల్సి ఉందని, అయినా ఫేక్ వీడియోలను మీడియాకు రిలీజ్ చేస్తూ తన కెరీర్‌ను నాశనం చేస్తోందని, ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లక్ష్మీ ఫిర్యాదు మేరకు గురువారం ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కిరణ్ రాయల్‌పై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆమెపైనా కేసు నమోదు చేయాలని కిరణ్ రాయల్ తిరుపతి రూరల్ పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తటపటాయించినప్పటికీ ఎట్టకేలకు అర్ధరాత్రి కేసు నమోదుకు ఉపక్రమించారు. చివరగా ఒకసారి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఎఫ్ఐఆర్ నమోదులో చేర్చాల్సిన బీఎన్ఎస్ సెక్షన్ల గురించి వివరించేందుకు ప్రయత్నించగా ఆయన కేసు నమోదుకు అంగీకరించనట్టు సమాచారం. దీంతో బాధితురాలు లక్ష్మీపై ఎఫ్ఐఆర్ నమోదును సీఐ చిన్నగోవిందు వాయిదా వేసినట్లు తెలిసింది.

వైభవోపేతం.. కోదండ రాముడి పేటోత్సవం..!

- ఊరేగింపుగా వచ్చిన సీతారామ సమేత లక్ష్మణుల ఉత్సవర్లు
- కేసీపేటలో ఘనంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం
- చుట్టుప్రక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు



తిరుపతి కోదండరామస్వామి ఆలయం నుంచి పేటోత్సవానికి ఊరేగింపుగా బయలుదేరిన ఉత్సవర్లు



కేసీపేటలో ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి రూరల్ : మండలంలోని కూపుచంద్రపేటలో గురువారం తిరుపతి శ్రీ కోదండరామస్వామి పేటోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా మాఘ పౌర్ణమి రోజున పేటోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు తిరుపతి నగరంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయం నుంచి శ్రీసీతారామ సమేత లక్ష్మణ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కూపుచంద్రపేట గ్రామానికి తీసుకువచ్చారు. భక్తుల గోవింద నామ స్మరణ, చెక్క భజనలు, కోలాటాలు, కేరళ వాయిద్యాలతో ఊరేగింపు కనువిందు చేసింది. ఊరేగింపు అవిలాల, వేదాంతపురం, మల్లంగుంట, చిగురువాడ మీదుగా సాగింది. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామికి మొక్కులు చెల్లించారు.

ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు

కూపుచంద్రపేట గ్రామం చేరుకున్న శ్రీ సీతారామ సమేత లక్ష్మణ స్వామికి అర్చకులు వైఖానస ఆగమోక్తంగా పూజలు చేశారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఊంజల్ సేవ, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 వరకు గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం తిరిగి తిరుపతి నగరంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి ఉత్సవమూర్తులను తీసుకువెళ్లారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరుపతి : 99516 02971
చంద్రగిరి : 95055 17845